# వాస్తవ నేస్తం
తెలుగు దిన పత్రిక
ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...



విలేకరులు కావలెను
http://vaasthavanestham.com
వాస్తవ నేస్తం
తెలుగు దిన పత్రిక
ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...
సంప్రదించండి
తెలంగాణ 8099779988
ఆంధ్రప్రదేశ 9985337979
తెలంగాణ, ఆంధ్రప్రదేశ రాష్ట్రాల్లో
వాస్తవ నేస్తం దిన పత్రికలో పనిచేయుటకు ఉత్సాహవంతులైన
- జిల్లా బ్యూరో చీఫ్‌లు
- జిల్లా స్టాఫ్ రిపోర్టలు
- నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు
- మండల రిపోర్టర్లు కావలెను



సంపుటి : 2 సంచిక : 291 ఆదివారం 26 మే 2024 పేజీలు : 8 వెల : 5/-

Published form Adilabad, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda, Medchal Malkajgiri




# ఎట్టా బ్రతికేది!

కూరగాయల మార్కెట్‌కి వెళ్తే షాకే..

పెరిగిన ధరలతో సామాన్యులకు తిప్పలు

ఏందన్నా కూరగాయల ధరలు ఇట్టా ఉన్నాయ్..

రైతు బజార్లు, వారపు సంత, కూరగాయల మార్కెట్.. ఎక్కడ చూసినా ధరల మోతే.

ఒక్కరోజు కూరగాయలకు కనీసం రూ.100పైనే ఖర్చు చేయాల్సిన పరిస్థితి

-3లో

వాతావరణ మార్పులకు అనుగుణంగా

## పంటల మార్పిడి

- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- క్లీన్ ఎనర్జీ కోసం తన వంతు కృషి చేస్తాం
- వాటర్ బాడీస్‌ను రక్షిస్తాం
- ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేస్తాం



హైదరాబాద్

వాతావరణ మార్పులకు అనుగుణంగా పంటల మార్పిడి చేయాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. హెూటల్ టూరిజం ప్లాజా సోమాజిగూడలో హైదరాబాద్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో "ఎనర్జీ ట్రాన్స్మిషన్ ఇన్ ఇండియా ఫోకస్ ఆన్ తెలంగాణ" అనే అంశంపై వర్క్ షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హాజరయ్యారు. ఈ వర్క్ షాప్ మంచి ఫలితాలు ఇవ్వాలని కోరుకుంటున్నానని అన్నారు. హైదరాబాద్ ప్రెస్ క్లబ్ -మిగతా3లో



## ఇండియా "ముజ్రా" డాన్స్ ఆడుతోంది

- పీఎం కోలుకోవాలంటూ విపక్షం కౌంటర్
- ఇండియా' కూటమి ముస్లిం ఓట్ బ్యాంకు కోసం బానిసత్వం చేస్తోంది
- పీఎం మానసిక పరిస్థితికి ఆయన మాటలు అద్దం పడుతున్నాయి
- చికిత్సతో త్వరగా కోలుకోవాలని ఆశిస్తున్నాం
- ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ

# స్మార్ట్ కార్డ్ తరహాలో కొత్త రేషన్ కార్డులు?

- స్టేట్ కోడ్‌ను టీఎస్ నుంచి టీజీగా మార్చిన ప్రభుత్వం
- ఇప్పుడు ఆహార భద్రత కార్డుల డిజైన్‌ను మార్చేందుకు కసరత్తు
- పాత రేషన్ కార్డుల స్థానంలో.. 'టీజీ' ప్రింట్‌తో కొత్తగా స్మార్ట్ కార్డులు జారీ చేసేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం.
- ఇప్పటికే కొత్త కార్డు స్వరూపంపై అధికారులతో చర్చలు




హైదరాబాద్

తెలంగాణ స్టేట్ కోడ్‌ను టీఎస్ నుంచి టీజీగా మార్చిన రాష్ట్ర ప్రభుత్వం.. ఇప్పుడు ఆహార భద్రత కార్డుల డిజైన్‌ను మార్చేందుకు కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. పాత రేషన్ కార్డుల స్థానంలో.. 'టీజీ' ప్రింట్‌తో కొత్తగా స్మార్ట్ కార్డులు జారీ చేసేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. కొత్త రేషన్ కార్డులు సరికొత్తగా బార్ కోడ్‌తో.. ఈజీ యాక్సెస్ చేసేలా రూపొందిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే కొత్త కార్డు స్వరూపంపై అధికారులతో చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి దాదాపు ఆరు నెలలు -మిగతా3లో

# జూన్‌లో పదవుల జాతర

- సార్వత్రిక సమరం ముగియడంతో ఇప్పుడు అంతా స్థానిక సంస్థలు, నామినేటెడ్ పదవులపై ఫోకస్
- ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కొద్దిమందికి నామినేటెడ్ పదవులు వరించినా, ఇంకా భర్తీ చేయాల్సినవి చాలానే ఉన్నాయి
- సంక్రాంతిలోపే ఈ పదవులను భర్తీ చేస్తామని గతంలో రేవంత్ ప్రకటన
- జూన్ నెలాఖరుకు పంచాయతీ ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు
- నెలాఖరులోగా మంత్రివర్గ విస్తరణ పూర్తి చేయాలనే యోచనలో సీఎం రేవంత్ రెడ్డి
- ఇప్పటికే కేబినెట్ విస్తరణపై సీఎం రేవంత్ రెడ్డి అధిష్టానం అనుమతి తీసుకున్నట్లు సమాచారం
- పార్టీ కోసం బాగా కష్టపడ్డ వారికే మంత్రి పదవులు, నామినేటేడ్ పదవులు ఉంటాయని భావన



హైదరాబాద్

సార్వత్రిక సమరం ముగియడంతో ఇప్పుడు అంతా స్థానిక సంస్థలు, నామినేటెడ్ పదవులపై ఫోకస్ పెడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కొద్దిమందికి నామినేటేడ్ పదవులు వరించినా, ఇంకా భర్తీ చేయాల్సినవి చాలానే ఉన్నాయి. పంచాయతీలు, మండల, జిల్లా పరిషత్ ఎన్నికలకు గడువు సమీపిస్తుండటంతో ద్వితీయ, తృతీయ శ్రేణి నేతలు పదవుల కోసం తమ ప్రయత్నాలు మొదలుపెట్టారు. తెలంగాణలో అధికారంలోకి వచ్చి 5 నెలలు దాటినా, పార్టీలోని చాలా మంది నేతలకు నామినేటెడ్ పదవులు ఇంకా దక్కలేదు. సంక్రాంతిలోపే ఈ పదవులను భర్తీ చేస్తామని గతంలో రేవంత్ ప్రకటించారు. అయితే, కొన్ని పరిస్థితుల వల్ల పెద్ద సంఖ్యలో భర్తీ ఆలస్యమవుతూ వచ్చింది. లోక్ సభ ఎన్నికల ఫలితాల ఆధారంగా నామినేటెడ్ పోస్టులు భర్తీ చేయాలని రేవంత్ వ్యూహం. ఈ విషయంపై ఇప్పటికే అధిష్టానం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారంతెలంగాణలో వరుసగా ఎన్నికల సందడి నెలకొంది. ఇప్పటికే లోక్ సభ ఎన్నికలు పూర్తి కాగా 27న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక జరగనుంది. జూన్ నెలాఖరుకు పంచాయతీ ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇప్పటికే ఆ దిశగా కసరత్తు మొదలయింది. అదే జూన్ నెలాఖరులోగా సీఎం రేవంత్ రెడ్డి -మిగతా3లో




# జాబ్ క్యాలెండర్ పెద్ద మోసం

- 2 లక్షల ఉద్యోగాల ఊసే లేదు : కేటీఆర్
- ఒక్క నోటిఫికేషన్ కూడా రాలేదు.
- ఇదివరకు కేఏ పాల్‌పై జోకులు వేసేవారు..
- ఇక కోమటిరెడ్డిపై వేసే పరిస్థితి వస్తుంది!: కేటీఆర్
- మంత్రి హెూదాలో ఉండి కరెంట్ పోతుందని ఎలా అంటారని మండిపాటు

హైదరాబాద్

జాబ్ క్యాలెండర్ పేరిట కాంగ్రెస్ పార్టీ నిరుద్యోగులను మోసం చేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిప్పులు చెరిగారు. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేస్తామన్నారు. ఏడాదికి 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామన్నారు. ఇప్పటి వరకు ఒక్క నోటిఫికేషన్ కూడా రాలేదు అని కేటీఆర్ తెలిపారు. తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. -మిగతా3లో

# ఎట్టా బ్రతికేది..

కూరగాయల ధరలు మండిపోతున్నాయి. రైతు బజార్లు, వారపు సంత, కూరగాయల మార్కెట్..ఎక్కడ చూసినా ధరల మోతే. సామాన్యులు కొనలేని పరిస్థితి నెలకొంది. మార్కెట్లో కూరగాయల ధరలు మండిపోతున్నాయి.. పెరిగిన ధరలతో సామాన్యులు తిప్పలు పడుతున్నారు.. ప్రస్తుతం హోల్‌సేల్ మార్కెట్‌లో రూ.20 నుంచి రూ.25 వరకు ధర పలుకుతుండగా వారాంతపు సంతల్లో కిలో రూ.60-80 పలుకుతున్నాయి. పచ్చిమిర్చి, చిక్కుడు సెంచరీ చేరువ అవుతుండగా.. బీన్స్ డబుల్ సెంచరీకి చేరువ అవుతుంది. నలుగురు ఉన్న కుటుంబంలో ఒక్కరోజు కూరగాయలకు కనీసం రూ.100పైనే ఖర్చు చేయాల్సిన పరిస్థితి వచ్చిందని సామాన్యులు వాపోతున్నారు. మిగిలిన కూరగాయల్ని కేజీ 50పైనే ఉన్నాయి.. ధరలు పెరుగుదలకు దిగుబడి లేకపోవటమే కారణమంటున్నారు వ్యాపారులు..రీటైల్ మార్కెట్‌లో అయితే మరి అధిక ధరలకు అమ్ముతున్నారు వ్యాపారులు..దీంతో సామాన్యులు బెంబేలెత్తిపోతున్నారు. వర్షాలు కురిస్తే గాని సాధారణ పరిస్థితులు నెలకొనవు, ఎండలు ఎక్కువగా ఉండడంతో, సాగునీరు లేక రైతులు కూరగాయలు పండించడం లేదు. ఐతే మరో నెలరోజుల పాటు ధరలు ఇలానే ఉండే అవకాశం ఉందని మార్కెట్ వ్యాపారులు చెబుతున్నారు. దీంతో జనం కూరగాయలు కొనాలంటే బెంబేలెత్తుతున్నారు. ఎండాకాలం మండేకాలం..



దీంతో కూరగాయల సాగు గణనీయంగా తగ్గింది.. ఉత్పత్తి తగ్గిపోవడంతో కూరగాయల ధరలు ఉట్టెక్కాయి. ఇక ఇక ప్రస్తుతం అల్లం వెల్లుల్లి ధరలు కూడా మండిపోతున్నాయి. అల్లం ధర మార్కెట్లో బాగా పెరిగపోయింది. ఓపెన్ మార్కెట్లో ప్రస్తుతం అల్లం కేజి 250 నుంచి 300 రూపాయలు వరకు ఉంటుంది.. అలాగే రైతు బజార్లలో కొంటే 190 నుంచి 210 వరకు ఉంటుంది.

# ఇండియా "ముజ్రా" డాన్స్ ఆడుతోంది

**బీహార్:** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఎన్నికల ప్రచారంలో విపక్షాలపై నిప్పులు చెరుగుతున్నారు. బీహార్‌లోని పాటలిపుత్రలో శనివారం జరిగిన ఎన్నికల ప్రచారంలో 'ఇండియా' కూటమి ముస్లిం ఓట్ బ్యాంకు కోసం బానిసత్వం చేస్తోందని, 'ముజ్రా' ఆడుతోందని వ్యాఖ్యానించారు. కాగా, పీఎం 'ముజ్రా' వ్యాఖ్యలపై విపక్ష నేతలు ఘాటుగా స్పందించారు. పీఎం మానసిక పరిస్థితికి ఆయన మాటలు అద్దం పడుతున్నాయని, చికిత్సతో త్వరగా కోలుకోవాలని ఆశిస్తున్నామని పేర్కొంది.

### మోదీ ఏమన్నారు?

ఇండియా కూటమిలోని పలు ప్రధాన పార్టీలను ప్రధాని మోదీ శనివారంనాడు టార్గెట్ చేస్తూ, ముస్లిం ఓట్ల కోసం ఇండియా కూటమి బానిసత్వం చేస్తోందని ఆరోపించారు. "ముజ్రా" డాన్స్ ఆడుతోందన్నారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్లను దోచుకునే ప్రయత్నాలను అడ్డుకుంటామన్నారు. సామాజిక న్యాయం కోసం దిశానిర్దేశం చేసిన భూమి బీహార్ అని, ఇక్కడ



ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ హక్కులను దోచుకోవడానికి, వాటిని ముస్లింలకు మళ్లించడానికి ఇండియ కూటమి ప్లాన్ చేస్తోందన్నారు.

### చికిత్స తీసుకోండి..

ప్రధానమంత్రి చేసిన 'ముజ్రా' (మొఘల్‌ల కాలంలోని నృత్యరీతి) వ్యాఖ్యలపై విపక్షాలు మండిపడ్డాయి. ప్రధాని నోటి వెంట 'ముజ్రా' మాట వచ్చినట్టు విన్నానని, ఆయన మానసిక స్థితిపై సందేహం కలుగుతోందని కాంగ్రెస్ ప్రతినిధి పవన్ ఖేర వ్యాఖ్యానించారు. "మోదీజీ...మీరు ఏదైనా చికిత్స తీసుకోండి. అమిత్‌షా, జేపీ నడ్డా అయినా ఆయనను తక్షణం చూపించాలి. బహుశా ఎండల కింద స్పీచ్‌లు ఇచ్చి మైండ్ మీద ఆ ప్రభావం పడినట్టు ఉంది" అని ఖేర సూచించారు. తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ సాకేత్ గోఖలే మాట్లాడుతూ, నారీ శక్తితో మొదలు పెట్టి ఇప్పుడు 'ముజ్రా' వంటి వ్యాఖ్యల స్థాయికి మోదీ దిగిపోయారని ఆక్షేపించారు. పదేళ్ల పాటు ఎంత దాచుకోవాలనుకున్నా ఆయనలోని వ్యక్తి ఇప్పటికి బయటకు వచ్చారని, దిగజారుడు భాష మాట్లాడుతున్నారని ఆయన ట్వీట్ చేశారు. నిన్నమొన్నటి వరకూ 'మచిలీ, మటన్, మంగళసూత్ర' అంటూ వచ్చిన మోదీ ఇప్పుడు 'ముజ్రా' అంటున్నారని, ప్రధాని మాట్లాడాల్సిన భాష ఇదేనా అని ఆర్జేడీ నేత మనోజ్ ఝా ప్రశ్నించారు. శివసేన(యూబీటీ) నేత ప్రియాంక చతుర్వేది స్వయంగా మోదీ వీడియో క్లిప్‌ను జత చేస్తూ "త్వరలోనే కోలుకోవాలని ఆశిస్తున్నాను మోదీజీ.." అంటూ ట్వీట్ చేశారు.

# చార్‌ధామ్ యాత్రలో విషాదం..

చార్‌ధామ్ యాత్రలో విషాదం చోటు చేసుకున్నది. యాత్ర ప్రారంభమైన 16 రోజులు 56 మంది పర్యాటకులు ప్రాణాలు కోల్పోయారు. ఇందులో 50 ఏళ్లు పైబడిన 40 మంది ఉన్నారు. 47 మంది గుండెపోటు, పల్మనరీ ఎడెమా కారణంగా మరణించినట్లు అధికార వర్గాలు పేర్కొన్నారు. అత్యధికంగా కేదార్‌నాథ్ ధామ్ యాత్ర మార్గంలో ఇప్పటి వరకు గరిష్ఠంగా 27 మంది ప్రాణాలు కోల్పోయారు. శుక్రవారం సాయంత్రం నలుగురు గుండెపోటుతో మరణించారు. బద్రీనాథ్, కేదార్‌నాథ్, గంగోత్రి, యమునోత్రి సముద్రమట్టానికి ఎత్తున హిమాలయప్రాంతాల్లో ఉన్నాయి.
చలితో పాటు ఆక్సిజన్ అందక శ్వాస తీసుకోవడంలో సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుంది. మే 10న మొదలైన చార్‌ధామ్ యాత్రలో 15 రోజుల్లో 52 మంది యాత్రికులు గుండెపోటు, పల్మనరీ ఎడెమా, అల్పోష్ణస్థితి (శరీర ఉష్ణోగ్రత తగ్గిన సమయంలో గుండెపోటు ఆగిపోవడం), తలకు బలమైన గాయాల కారణంగా మరణించారు. ఇప్పటి వరకు 56 మంది భక్తులు యాత్ర కోసం వచ్చి ప్రాణాలు కోల్పోయారని గర్వాల్ కమిషనర్ వినయ్ శంకర్ పాండే ధ్రువీకరించారు. మృతుల్లో అత్యధికంగా 60 సంవత్సరాలు పైబడిన వ్యక్తులే ఉన్నారని.. ఇందులో ఎక్కువగా గుండెపోటు బాధితులే ఎక్కువగా ఉన్నారన్నారు.
ఆరోగ్యం బాగాలేని వ్యక్తులు యాత్రకు వెళ్లకపోవడమే మంచిదని పరీక్షలు నిర్వహించిన అనంతరం వైద్యులు సూచిస్తున్నారు. అయినా యాత్రను ముందుకు వెళ్లాలనుకునే వ్యక్తుల నుంచి రాతపూర్వకంగా ఫారం నింపేలా చర్యలు తీసుకుంటున్నారు. హిమాలయ పర్వతాల ఎత్తయిన



ప్రాంతాల్లో ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని పర్యాటకులకు ఆరోగ్య శాఖ సూచించింది. కేదార్‌నాథ్, యమునోత్రి ధామ్‌లకు కాలినడకన వెళ్లే సమయంలో ఒకటి నుంచి రెండు గంటల మధ్యలో ఐదు నుంచి పది నిమిషాలు విరామం తీసుకోవాలని సూచిస్తున్నారు. వెచ్చని బట్టలు, వర్షంలో తడవకుండా రెయిన్ కోట్స్, పల్స్ ఆక్సిమీటర్, థర్మామీటర్ వెంట తీసుకువెళ్లాలని.. గుండె జబ్బులు, అధిక రక్తపోటు, ఉబ్బసం మధుమేహంతో బాధపడే ప్రయాణికులు అవసరమైన మందులు, డాక్టర్ నంబర్‌ను తమ వద్ద ఉంచుకోవాలని చెప్పింది. ప్రయాణంలో ఛాతినొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, తల తిరగడం, వాంతులు వచ్చినప్పుడు సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రథమ చికిత్స తీసుకోవాలని ఆరోగ్యశాఖ సూచించింది.
దీంతోపాటు వెచ్చని బట్టలు, వర్షం నుంచి రక్షణ కోసం రెయిన్ కోట్, గొడుగు, పల్స్ ఆక్సిమీటర్, థర్మామీటర్ వంటివి తెచ్చుకోవాలని సూచించారు. గుండె జబ్బులు, అధిక రక్తపోటు, ఉబ్బసం, మధుమేహంతో బాధపడే యాత్రికులు అవసరమైన మందులు, వైద్యుల నంబర్‌ను అందుబాటులో ఉంచుకోవాలని స్పష్టం చేశారు.

## ఓటేసిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము..

**న్యూఢిల్లీ :** భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము.. తన ఓటు హక్కు వినియోగించుకున్నారు. రాష్ట్రపతి భవన్ కాంప్లెక్స్‌లోని డాక్టర్ రాజేంద్రప్రసాద్ కేంద్రీయ విద్యాలయంలోని పోలింగ్ బూత్‌లో ద్రౌపదీ ముర్ము ఓటు వేశారు. మహిళా ఓటర్ల కోసం.. మహిళ సిబ్బందితో ఈ పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ మేరకు రాష్ట్రపతి భవన్ ఎక్స్ వేదికగా పోస్ట్ చేసింది. న్యూఢిల్లీలో మొత్తం ఏడు లోక్‌సభ స్థానాలు ఉన్నాయి. వాటిలో రాష్ట్రపతి భవన్.. న్యూఢిల్లీ లోక్‌సభ స్థానం పరిధిలోకి వస్తుంది. గతేడాది నవంబర్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము.. కొత్త ఓటర్ ఐడీ కార్డు తీసుకున్నారు. అంతకుముందు ఆమెకు ఒడిశా చిరునామాతో ఓటర్ ఐడీ కార్డు ఉండేది. దానిని అప్ డేట్ చేయించుకున్నారు. ఒడిశాకు చెందిన ద్రౌపది ముర్ము.. 2022, జులై 25న భారత రాష్ట్రపతిగా బాధ్యతలు చేపట్టారు.



## సందేహాల వాతావరణాన్ని సృష్టించే యత్నం..

### పోలింగ్ డేటా వివాదంపై సీఈసీ రాజీవ్ కుమార్



**న్యూఢిల్లీ:** ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) రాజీవ్ కుమార్ శనివారం ఢిల్లీలో ఓటు వేశారు. తన ఓటు హక్కును వినియోగించుకున్న ఆయన పోలింగ్ డేటా వివాదంపై మాట్లాడారు. సందేహాల వాతావరణాన్ని సృష్టించే ప్రయత్నంగా ఆయన ఆరోపించారు. బూత్‌ల వారీగా పోలింగ్ శాతంపై ఎలాంటి ఆదేశాలు ఇచ్చేందుకు సుప్రీంకోర్టు శుక్రవారం నిరాకరించింది. ఈ నేపథ్యంలో కోర్టు నిర్ణయంపై సీఈసీ రాజీవ్ కుమార్ స్పందించారు. 'వారు (న్యాయమూర్తులు) నిజాన్ని అంగీకరించారు. సందేహాస్పద వాతావరణాన్ని సృష్టించే ప్రయత్నం జరిగింది. మేం ఏదో ఒక రోజు ఖచ్చితంగా దీని గురించి అందరితో చర్చిస్తాం' అని అన్నారు. కాగా, దేశ ఎన్నికల ప్రక్రియపై అనుమానాలు వ్యక్తం కావడం పట్ల సీఈసీ రాజీవ్ కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రక్రియ సమగ్రతను కాపాడేందుకు, ఆందోళనలను పరిష్కరించేందుకు ఈసీ నిబద్ధతతో ఉందని తెలిపారు. బహుశా ఈవీఎంలు సరిగ్గా పని చేయకపోవడం, ఓటింగ్ లిస్ట్ తప్పుగా ఉండటం లేదా ఓటర్ల జాబితా తారుమారు కావడం వంటి పలు సందేహాలు ప్రజల్లో తలెత్తుతున్నాయని చెప్పారు. సుప్రీంకోర్టు కూడా దీని గురించి ప్రస్తావించిందని అన్నారు. 'ఇలాంటి సందేహాలు ఎందుకు సృష్టిస్తున్నారు? ఎందుకు అనుమానాలు తలెత్తుతున్నాయి? ఏం నాటకం జరుగుతోంది? ఇవన్నీ ఒక రోజు బయటపెడతాం. ప్రజలను ఎలా తప్పుదోవ పట్టిస్తున్నారో అందరికీ చూపుతాం' అని అన్నారు.

### 'ఈవీఎంలకు బీజేపీ ట్యాగ్‌లు..'

దేశంలో ఓవైపు శనివారం లోక్ సభ ఎన్నికల ఆరో దశ పోలింగ్ కొనసాగుతున్న తరుణంలో కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీపై తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) సంచలన ఆరోపణలు చేసింది. పశ్చిమ బెంగాల్ లో బీజేపీ ఈవీఎంలను ట్యాంపరింగ్ చేసిందంటూ ఆరోపించింది. బంకురాలోని రఘునాథ్ పూర్ లో ఐదు ఈవీఎంలకు బీజేపీ ట్యాగ్ లు కనిపించాయంటూ ఫొటోలను పార్టీ సోషల్ మీడియా ఖాతా 'ఎక్స్' ద్వారా విడుదల చేసింది. అందువల్ల బీజేపీపై ఈసీ తక్షణమే చర్యలు తీసుకోవాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని తృణమూల్ కాంగ్రెస్ డిమాండ్ చేసింది. ఈ నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం వెంటనే స్పందించింది. తృణమూల్ కాంగ్రెస్ ఆరోపణలను తోసిపుచ్చింది. ఈవీఎంలను పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసేటప్పుడు ఆయా పార్టీల అభ్యర్థులు, వారి ఏజెంట్ల సంతకాలు తీసుకుంటామని వివరించింది. కానీ రఘునాథ్ పూర్ లో కేవలం బీజేపీ తరఫు ప్రతినిధులు మాత్రమే ఉండటంతో ఈవీఎం, వీవీ ప్యాట్ యంత్రంపై వారి సంతకం మాత్రమే తీసుకోవడం కుదిరిందని సోషల్ మీడియా వేదికగా బదులిచ్చింది. పూర్తిగా సీసీటీవీ కవరేజీలోనే ఈ ప్రక్రియ జరిగిందని స్పష్టం చేసింది. అయితే పోలింగ్ మొదలయ్యాక అక్కడ (పోలింగ్ స్టేషన్ నంబర్లు 56, 58, 60, 61, 62) అన్ని పార్టీల ఏజెంట్ల సంతకాలను సేకరించినట్లు వెల్లడించింది. ఈ విషయంలో ఎన్నికల నిబంధనలన్నింటినీ అనుసరించామని ఈసీ తెలిపింది. పైగా ఈ ప్రక్రియను పూర్తిగా వీడియో కూడా తీశామని వివరించింది. లోక్ సభ ఎన్నికల ఆరో దశలో భాగంగా పశ్చిమ బెంగాల్ లో ఆరు స్థానాలకు ( తమ్ లుక్, కాంతి, ఘటాల్, ఝార్ గ్రామ్, మేదినీపూర్, పురూలియా, బంకూరా) శనివారం పోలింగ్ కొనసాగుతోంది.



## నియంతృత్వం, ద్రవ్యోల్బణం, నిరుద్యోగం పెరుగుదలకు వ్యతిరేకంగా ఓటు వేశా

**ఢిల్లీ:** దేశ వ్యాప్తంగా పెరుగుతున్న నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, నియంతృత్వానికి వ్యతిరేకంగా ఓటు వేశానని ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ అన్నారు. లోక్‌సభకు శనివారం జరుగుతున్న 6వ దశ పోలింగ్‌లో కుటుంబ సభ్యులతో కలిసి కేజ్రీవాల్ ఓటు హక్కు వినియోగించుకున్నారు.తన తండ్రి, భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి పోలింగ్ కేంద్రానికి వచ్చిన కేజ్రీవాల్.. అక్కడ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'మా నాన్న, భార్య, ఇద్దరు పిల్లలందరూ ఓటు వేశారు. ఆరోగ్యం బాలేకపోవడంతో అమ్మ ఓటు వేయలేకపోయారు. నియంతృత్వానికి, ద్రవ్యోల్బణం, నిరుద్యోగానికి వ్యతిరేకంగా నేను ఓటేశాను. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకుని ప్రజాస్వామ్యాన్ని కాపాడండి' అని కేజ్రీవాల్ పేర్కొన్నారు. దేశంలోని 6 రాష్ట్రాలు, 2 కేంద్రపాలిత ప్రాంతాల్లోని 58 లోక్‌సభ నియోజకవర్గాల్లో శనివారం పోలింగ్ జరుగుతోంది. ఆయా ప్రాంతాల్లో చెదురుమదురు ఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా కొనసాగుతోందని ఎన్నికల సంఘం అధికారులు తెలిపారు. 6వ దశలో మొత్తం 889 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. ఇండియా కూటమి పొత్తులో భాగంగా ఢిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీ 4, కాంగ్రెస్ 3 స్థానాల్లో అభ్యర్థులను నిలిపింది. పొత్తు ఉన్న కారణంగా ఏఐసీసీ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ తన నియోజకవర్గంలో బరిలో నిలిచిన ఆమ్ ఆద్మీ పార్టీ అభ్యర్థికి ఓటు వేశారు.

## బెంగళూరు రేవ్ పార్టీ కేసు..

### ఎమ్మెల్యే కాకాణి కారు స్టిక్కర్ వాడిన వ్యక్తి అరెస్టు

బెంగళూరు రేవ్ పార్టీ కేసులో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. డ్రగ్స్ టెస్టులో పాజిటివ్ వచ్చిన వారిని బెంగళూరు పోలీసులు నోటీసులు జారీ చేశారు. సినీ నటి హేమ, ఆషురాయ్ సహా 86 మందికి నోటీసులు జారీ చేశారు. ఈ క్రమంలోనే రేవ్ పార్టీ జరిగిన జీఆర్ ఫామ్‌హౌస్ యజమాని గోపాల్‌రెడ్డికి కూడా పోలీసులు నోటీసులు జారీ చేశారు. ఈ కేసులో ఏ6గా ఉన్న గోపాల్ రెడ్డిని విచారణ అధికారి ఎదుట హాజరుకావాలని సీసీబీ నోటీసులు జారీ చేసింది. కాగా, రేవ్ పార్టీ కేసుకు సంబంధించి విచారణలో భాగంగా ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్ రెడ్డి కారు స్టిక్కర్ ఎవరు వాడారనే దానిపై కూడా పోలీసులు దృష్టిసారించారు. ఈ క్రమంలోనే పూర్ణారెడ్డి అనే వ్యక్తి కాకాణి కారు స్టిక్కర్ వాడినట్లు పోలీసులు గుర్తించారు. రేవ్ పార్టీపై పోలీసుల దాడి సమయంలో ఫామ్‌హౌస్ నుంచి పూర్ణారెడ్డి పరారైనట్లు గుర్తించారు. నిన్న సాయంత్రం బెంగళూరు సీసీబీ పోలీసులు పూర్ణారెడ్డిని అదుపులోకి తీసుకున్నారు.



# జూన్‌లో పదవుల జాతర

-మొదటి పేజి తరువాయి

మంత్రివర్గ విస్తరణ పూర్తి చేయాలనే యోచనలో ఉన్నారు. ప్రస్తుతం తెలంగాణ కేబినెట్‌లో సీఎంతో సహా 12 మంది మంత్రులున్నారు. మరో ఆరుగురికి ఈసారి అవకాశం ఉందని పార్టీ వర్గాలు అంటున్నాయి. ఇప్పటికే కేబినెట్ విస్తరణపై సీఎం రేవంత్ రెడ్డి అధిష్టానం అనుమతి తీసుకున్నట్లు సమాచారం. అయితే, మంత్రులుగా ఎవరిని తీసుకోవాలనే దానిపై రేవంత్‌కు పూర్తి స్వేచ్ఛను ఇచ్చినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఎన్నికల కోడ్, ఆ తర్వాత ఊపిరి సలపనంతగా లోక్ సభ ఎన్నికల ప్రచారం, స్టార్ క్యాంపెయినర్‌గా పొరుగు రాష్ట్రాలకు వెళ్లి కాంగ్రెస్ తరపున ప్రచారం, ఇలా ఇన్నాళ్లూ బిజీబిజీగా ఉన్న రేవంత్, మంత్రివర్గ విస్తరణను వాయిదా వేస్తూ వచ్చారు.జూన్ 4న లోక్ సభ ఎన్నికల ఫలితాలు ఉండనున్నాయి. ఈ ఎన్నికలలో ఏఏ నియోజకవర్గంలో ఎమ్మెల్యేలు ఎలా పనిచేశారు. పార్టీ విజయానికి ఎలా తోడ్పడ్డారు అనే అంశాలను పరిశీలించి బాగా కష్టపడ్డ వారికే మంత్రి పదవులు ఉంటాయని భావిస్తున్నారు. మరోవైపు, సీనియర్లు తమ అనుకూలమైన వారికి పదవుల కోసం అధిష్టానం దగ్గర ప్రయత్నాలు ఇప్పటికే మొదలు పెట్టారని సమాచారం. కొత్తగా మంత్రి వర్గంలో అవకాశం కోసం ఎదురుచూస్తున్నవారిలో నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల వారికి ముందుగా ఛాన్స్ ఉంటుందంటున్నారు. అలాగే, రంగారెడ్డి జిల్లా నుంచి పరిగి ఎమ్మెల్యే రామ్ మోహన్ రెడ్డి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి పేర్లు కూడా



వినిపిస్తున్నాయి.ప్రస్తుత కేబినెట్‌లో ఖమ్మం నుంచి భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు ఉన్నారు. నల్గొండ నుంచి ఉత్తమ్ కుమార్, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, వరంగల్ నుంచి కొండా సురేఖ, సీతక్క, కరీంనగర్ నుంచి పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు ఉన్నారు. ఇక హైదరాబాద్ నుంచి కాంగ్రెస్ తరపున ఎమ్మెల్యేలు ఎవరూ లేరు. బీఆర్ఎస్ నుంచి ఎవరైనా కాంగ్రెస్‌లోకి వలస వస్తే వారికి ఛాన్స్ ఇచ్చే అవకాశం ఉందంటున్నారు. రైతు రుణమాఫీ పూర్తి చేసి.. కొత్త కేబినెట్, నామినేటెడ్ పదవుల ద్వారా పూర్తి సానుకూల వాతావరణం ఏర్పడుతుందని పార్టీ నేతలు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే రైతు రుణమాఫీ పైన బ్యాంకర్లతో ప్రభుత్వం చర్చలు చేస్తోంది. దీంతో, జూన్ ద్వితీయార్థంలో రాష్ట్రంలో మరోసారి రాజకీయంగా కీలక పరిణామాలు చోటు చేసుకొనే అవకాశం కనిపిస్తోంది.

# జాబ్ క్యాలెండర్ పెద్ద మోసం..

-మొదటి పేజి తరువాయి

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక అనేక మోసాలు జరుగుతున్నాయి. 2 లక్షలు ఉద్యోగాలు ఏడాదిలో ఇస్తామన్నారు. ఒక్క నోటిఫికేషన్ కూడా రాలేదు. బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రూప్-1 కింద 503 పోస్టులకు నోటిఫికేషన్ ఇస్తే.. దాన్ని రద్దు చేసి కొత్తగా 60 పోస్టులు కలిపి మళ్లీ నోటిఫికేషన్ ఇచ్చారు. దాన్ని కొత్త నోటిఫికేషన్ అంటున్నారు. 50 వేల పోస్టులతో మెగా డీఎస్సీ వేస్తమన్నాడు. తాము 5,089 పోస్టులతో డీఎస్సీ నోటిఫికేషన్ ఇస్తే దాన్ని కూడా రద్దు చేశారు. అయితే 50 వేల ఉద్యోగాలతో డీఎస్సీ నోటిఫికేషన్ వస్తదని అనుకుంటే.. 5,089 పోస్టులకు అదనంగా మరో 5913 కలిపి 11 వేల ఉద్యోగాలతో కొత్త నోటిఫికేషన్ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా నోటిఫికేషన్లు ఇచ్చిందేమీ లేదు. ఇవ్వకపోగా 2 లక్షల ఉద్యోగాల మాట తుంగలో తొక్కారు. జాబ్ క్యాలెండర్ అతిగతి లేదు. 4 వేల నిరుద్యోగ భృతి హామీ ఇవ్వలేదని భట్టి విక్రమార్క పచ్చి అబద్దం చెప్పారు అని కేటీఆర్ మండిపడ్డారు. ప్రభుత్వ ఉద్యోగాలకు నిర్వహించే రాత పరీక్షలకు రూపాయి కూడా ఫీజు తీసుకోనని రేవంత్ అన్నాడు. టెట్ ఫీజును 400 నుంచి 2 వేలు చేశాడు. ఇది వాస్తవం. ఇంకో దారుణం ఏంటంటే.. మేం కష్టపడి పరిశ్రమలు తెస్తే..వాటిని రేవంత్ పాతరేస్తున్నాడు. ఫార్మా సిటీ పేరిట 12 వేల ఎకరాల్లో



ప్రపంచంలోనే అతిపెద్ద ఫార్మా క్లస్టర్ పెట్టి, ప్రత్యక్షంగా, పరోక్షంగా 5 లక్షల ఉద్యోగాల సృష్టికి రంగమంతా సిద్ధం చేస్తే దానిని కూడా రేవంత్ రద్దు చేశారు. ఫార్మా సిటీని పక్కనపెట్టి.. రియల్ ఎస్టేట్ చేస్తానని రేవంత్ రెడ్డి అంటున్నాడని కేటీఆర్ ధ్వజమెత్తారు.

**కరెంట్ పోతే జనరేటర్ ఉండదా? అని చురక**

ఇదివరకు కేఏ పాల్‌పై అందరూ జోకులు వేసేవారని... త్వరలో కోమటిరెడ్డిపై జోకులు వేసే పరిస్థితి వస్తుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎద్దేవా చేశారు. టిమ్స్ ఆసుపత్రిపై మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చేసిన వ్యాఖ్యలపై కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. ఒక మంత్రి హోదాలో ఉండి 'కరెంట్ పోతుంద'ని ఎలా మాట్లాడుతారని మండిపడ్డారు. ఆయన మంత్రా? లేక జోకరా? అని ఎద్దేవా చేశారు. మూరు?లే అలా మాట్లాడుతారన్నారు.

కరెంట్ పోతే 14వ అంతస్తు నుంచి 27వ అంతస్తుకు ఎలా పోతారు? అని కోమటిరెడ్డి ప్రశ్నించారని... మరి 14 అంతస్తులే కడితే... 3వ అంతస్తులో ఉన్నప్పుడు కరెంట్ పోతే 14వ అంతస్తుకు ఎలా వెళతారు? అని కేటీఆర్ ప్రశ్నించారు. అసలు మంత్రి నోటి నుంచి కరెంట్ పోతుందనే మాట ఎందుకు వస్తుందో చెప్పాలన్నారు. తాము ఉన్నప్పుడు ఇలాంటి మాటలు రాలేదన్నారు. అంటే ఈ ప్రభుత్వాన్ని ఎంత మూరు?లు, ఎంత సన్నాసులు, ఎంత జోకర్లు నడుపుతున్నారో తెలుస్తోందన్నారు. కరెంట్ పోతే జనరేటర్ ఉండదా? అని చురక అంటించారు. ఆయన మంత్రా... నాకు అర్థం కావడం లేదు... పైగా ఆయన వేసిన ప్రశ్నకు మీరు (జర్నలిస్టులు) నన్ను అడగడమేమిటన్నారు.

# మెడికల్ కాలేజీల్లో కన్వీనర్ కోటా సీట్లు 100 శాతం తెలంగాణ విద్యార్థులకే దక్కాలి

**హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రం అవతరించి పదేళ్లు పూర్తి అవుతున్న నేపథ్యంలో వైద్య విద్య ప్రవేశాలకు సంబంధించి స్థానికత అంశంపై స్పష్టత ఇవ్వడంతో పాటు, మెడికల్ కాలేజీల్లో కన్వీనర్ కోట సీట్లు 100 శాతం సీట్లు తెలంగాణ విద్యార్థులకు దక్కేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మాజీ వైద్యారోగ్య శాఖ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు డిమాండ్ చేశారు. జూన్ మూడో వారంలో అడ్మిషన్ల ప్రక్రియ మొదలవుతున్న క్రమంలో ప్రభుత్వం తక్షణం స్పందించి స్పష్టత ఇచ్చేలా ఉత్తర్వులు జారీ చేయాలి. లేదంటే వైద్య విద్య చదివే అవకాశాలను తెలంగాణ విద్యార్థులు తీవ్రంగా కోల్పోతారు అని హరీశ్‌రావు పేర్కొన్నారు. తెలంగాణ ఏర్పాటుకు ముందున్న 20 మెడికల్ కాలేజీల్లోని 2,850 సీట్లలో కాంపిటెంట్ అథారిటీ కోటా కింద 1,900 సీట్లు ఉన్నాయి. ఇందులో 15 శాతం అన్ రిజర్వుడు కోటా అంటే 280 సీట్లు తెలంగాణ విద్యార్థులు కోల్పోతారు. దీంతోపాటు నిమ్స్ సహా ఇతర మెడికల్ కాలేజీల్లోని దాదాపు 150 పీజీ సీట్లు కోల్పోతారు అని హరీశ్‌రావు వెల్లడించారు.

**520 సీట్లు తెలంగాణ విద్యార్థులు కోల్పోవాల్సి వస్తుంది**

ఎంబీబీఎస్/పీజీ అడ్మిషన్ల ప్రక్రియ సమీపిస్తున్నప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ముఖ్యమైన విషయాలను పట్టించుకోకుండా నిర్లక్ష్యం ప్రదర్శిస్తుండటం దురదృష్టకరం. తెలంగాణ విద్యార్థుల ప్రయోజనాలు కాపాడడంలో కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యం చెందుతున్నది. ప్రభుత్వ తీరుతో తల్లిదండ్రులు, విద్యార్థులు తీవ్రంగా ఆందోళన



చెందుతున్నారు. రాష్ట్ర పునర్విభజన చట్టం మేరకు 2014 నుండి కన్వీనర్ కోటాలో 15 శాతం సీట్లకు తెలంగాణతో పాటు, ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు సైతం పోటీపడే వెసులుబాటు కల్పించారు. ఇదే విధానం కొనసాగితే, 2014 తర్వాత ఏర్పాటు చేసిన కొత్త మెడికల్ కాలేజీల్లో కూడా 15 శాతం అన్ రిజర్వుడు కోటా అమలు చేయాల్సి ఉంటుంది. దీని వల్ల దాదాపు 520 సీట్లు తెలంగాణ విద్యార్థులు కోల్పోవాల్సి వస్తుంది. దీన్ని నివారించేందుకు గాను తెలంగాణ ప్రభుత్వం, అన్ రిజర్వుడు కోటాను కేవలం పాత 20 మెడికల్ కాలేజీలకు మాత్రమే పరిమితం చేసిందని హరీశ్‌రావు తెలిపారు. దీనికోసం ఏపీ రీఆర్గనైజషన్ ఆక్ట్, ఆర్టికల్ 371%ణ% నిబంధనలకు లోబడి తెలంగాణ స్టేట్ మెడికల్/డెంటల్ కాలేజెస్ అడ్మిషన్ రూల్స్‌కు సవరణ చేస్తూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీని ప్రకారం, 2014 జూన్ 2 తర్వాత ఏర్పాటు చేసిన మెడికల్ కాలేజీల్లోని కాంపిటేటివ్ అథారిటీ కోటాలోని 100 శాతం సీట్లను తెలంగాణ విద్యార్థులకే రిజర్వ్ చేయడం జరిగింది. ఈ నిర్ణయం వల్ల తెలంగాణ విద్యార్థులకు 520 మెడికల్ సీట్లు అదనంగా లభించాయి. అయితే ప్రస్తుతం జూన్ 2తో విభజన చట్టానికి కాలం చెల్లుతుండటంతో పాత మెడికల్ కాలేజీలోని 100 శాతం కన్వీనర్ కోటా సీట్లను కూడా తెలంగాణ విద్యార్థులకు దక్కేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు హరీశ్‌రావు.

**ఎంబీబీఎస్ సీట్లు 8340..**

తెలంగాణ ప్రజలకు సూపర్ స్పెషాలిటీ సేవలు చేరువ చేయడంతో పాటు, తెలంగాణ విద్యార్థులకు వైద్య విద్య అందించేందుకు కేసీఆర్ గారు జిల్లాకు ఒక మెడికల్ కాలేజీ ప్రారంభించారు. తెలంగాణ ఏర్పాటుకు ముందు ప్రభుత్వ, ప్రైవేటులో కలిపి రాష్ట్రంలో 20 మెడికల్ కాలేజీలు ఉంటే, ఇప్పుడు ఆ సంఖ్య 56కు చేర్చించింది నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం. దీంతో తెలంగాణలో 2850 ఎంబీబీఎస్ సీట్లు మాత్రమే ఉంటే, ఇప్పుడు 8340 సీట్లకు పెరిగింది. ఎంబీబీఎస్, పీజీ సహా ఇతర వైద్య విద్య అభ్యసించాలనుకునే తెలంగాణ బిడ్డలకు పూర్తిస్థాయిలో న్యాయం జరగాలంటే, స్థానికత అంశంపై స్పష్టత ఇవ్వాలి. కన్వీనర్ కోటాలోని 100 శాతం సీట్లు తెలంగాణ విద్యార్థులకు దక్కేలా చూడాలి. ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకొని డాక్టర్ కావాలనుకునే వైద్య విద్యార్థుల అవకాశాలు మెరుగుపరచాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

## జూపల్లివి హత్యా రాజకీయాలు : ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

హైదరాబాద్ : రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి, కొల్లాపూర్ ఎమ్మెల్యే జూపల్లి కృష్ణారావు హత్యా రాజకీయాలు చేస్తున్నాడని బీఆర్ఎస్ నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ధ్వజమెత్తారు. తెలంగాణ భవన్‌లో కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డితో కలిసి ఆర్ఎస్పీ మీడియాతో మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్ రోజే జూపల్లి అనుచరులు, బీరం హర్షవర్ధన్ రెడ్డి కారు అద్దాలు ధ్వంసం చేశారు. గంట్రావ్‌పల్లిలో బీఆర్ఎస్ నాయకుడు, ఆర్మీ జవాన్ మల్లేష్ యాదవ్‌ను కాంగ్రెస్ నేతలు హత్య చేశారు. పానగల్ ఎంపీపీ శ్రీధర్ రెడ్డి మీద డీజిల్ పోసి దాడి చేశారు. జొన్నలబొగుడ అనే గ్రామంలో సర్పంచ్ రవి నాయక్ ఇంటిపై దాడి చేశారు. సాతాపూర్ గ్రామంలో బీఆర్ఎస్ నాయకుడు గుజ్జుల పరమేశ్ అనే వ్యక్తి ఇంటిపై దాడి చేశారు. పరమేశ్ సోదరుడికి కానిస్టేబుల్ ఉద్యోగం వస్తే ఆ ఉద్యోగం పోవాలని ఎఫ్ఐఆర్‌లో అతని పేరు నమోదు చేయించారు. చిన్న కార్పముల అనే గ్రామంలో దళిత యువకులపై కాంగ్రెస ‾ వాళ్లు దాడి చేశారు. జగదీష్ రెడ్డి అనే బీఆర్ఎస్ కార్యకర్త తన భార్యతో పొలంలో ఉండగా కాంగ్రెస్ కార్యకర్తలు, జూపల్లి అనుచరులు దాడి చేశారని ఆర్ఎస్పీ గుర్తు చేశారు. కుడికిళ్ల గ్రామంలో బీఆర్ఎస్ కార్యకర్త మూర్తిని ఘోరంగా కొట్టారు.. దీని మీద ఇంతవరకు పోలీస్ యాక్షన్ లేదు. కుడికిళ్ల గ్రామంలో లక్ష్మణ్ రావు అనే వ్యక్తి మీద దొంగ కేసులు పెట్టి 15 రోజులు జైల్లో పెట్టారు. కొల్లాపూర్ మండలం ముక్కిడిగుండం గ్రామంలో బీఆర్ఎస్ సీనియర్ నేత రామచంద్ర యాదవ్ పొలంలోకి కాంగ్రెస్ వాళ్లు వెళ్లి కొట్టి తిరిగి రామచంద్ర యాదవ్‌పైనే తప్పుడు కేసులు పెట్టారు.

## స్మార్ట్ కార్డ్ తరహాలో కొత్త రేషన్ కార్డులు?

-మొదటి పేజి తరువాయి

కావొస్తుంది. సీఎం రేవంత్ రెడ్డి పరిపాలనా పరంగా కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే అర్హులందరికీ కొత్త రేషన్ కార్డులు మంజూరు చేస్తామని అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన తర్వాత లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించి, స్క్రూటినీ కూడా పూర్తి చేశారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ గడువు పూర్తి కాగానే కొత్త రేషన్ కార్డులు జారీ చేసేందుకు కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతమున్న రేషన్ కార్డుల రూపం మార్చాలని ప్రభుత్వం భావిస్తోంది. వీటి స్థానంలో కొత్తవి జారీ చేయాలని నిర్ణయించింది. ఇటీవల ఆరోగ్యశ్రీ కార్డు పరిమితిని 5 లక్షల రూపాయల నుంచి పది లక్షలకు పెంచారు. దీంతో పాత ఆరోగ్యశ్రీ కార్డుల స్థానంలో కొత్తవి ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలుస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 90 లక్షల ఆహార భద్రత కార్డులు ఉన్నాయి. కొత్తగా మంజూరు చేసే రేషన్ కార్డు రూపం పూర్తిగా మార్చాలనే ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించింది. కొత్త కార్డులో ఎలాంటి వివరాలు పొందుపరచాలి అనే అంశంపై అధికారులు కసరత్తు చేస్తున్నారు.

## హామీలన్నీ అమలు చేస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటా..

**కాంగ్రెస్‌కు ఈటల రాజేందర్ సవాలు**



అధికారంలోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్ మాటలు తప్ప హామీల అమలు లేదని బీజేపీ నేత ఈటల రాజేందర్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అన్నింటినీ అమలు చేస్తే రాజకీయ సన్యాసం చేస్తానని సవాలు విసిరారు. వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా కొత్తగూడెం క్లబ్‌లో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఈటల రాజేందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ.. డిక్లరేషన్‌ల పేరుతో ఎన్నికల సమయంలో హడావుడి చేసిన కాంగ్రెస్ పార్టీ.. ఇప్పుడు హామీల అమలును గాలికి వదిలేసిందని మండిపడ్డారు. తెలంగాణలో అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడిచినా హామీలను నిలబెట్టుకోలేదని అన్నారు. ఆరు నెలల కాంగ్రెస్ ప్రభుత్వంలో ఒక్క ఉద్యోగం అయినా వచ్చిందా అని ప్రశ్నించారు. జాబ్ క్యాలెండర్ ఏమైందని నిలదీశారు. ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో ఓటర్లకు డబ్బులు పంచుతున్నారని ఈటల రాజేందర్ ఆరోపించారు. రాష్ట్రానికి అన్యాయం చేస్తున్న పార్టీలకు ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో గుణపాఠం నేర్పించాలని అన్నారు. నోటుతో ఓటును కొనాలని చూసేవారికి తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

## వాతావరణ మార్పులకు అనుగుణంగా పంటల మార్పిడి



-మొదటి పేజి తరువాయి

ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వర్క్ షాప్ మంచి ఫలితాలు ఇవ్వాలని కోరుకుంటున్నానని అన్నారు. మేధావులు పర్యావరణవేత్తలు కలిసి వాతావరణ పరిరక్షణ క్లీన్ ఎనర్జీ కోసం డాక్యుమెంట్ రూపంలో తమకు ఇస్తే ప్రభుత్వం ద్వారా కచ్చితంగా చర్యలు తీసుకునేందుకు కృషి చేస్తానని తెలిపారు. వాతావరణంలో చాలా మార్పులు జరిగాయి... కొన్ని సార్లు అంచనాలకు అందకుండా మార్పులు జరుగుతున్నాయని చెప్పుకొచ్చారు. పంటల మార్పిడి కూడా జరిగిందని, భూమిని రక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. క్లీన్ ఎనర్జీ కోసం తన వంతు కృషి చేస్తానని .. వాటర్ బాడీస్‌ను రక్షిస్తాం...ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

## వేల కోట్లు దోచుకుని ఢిల్లీకి పంపిస్తున్నారు.. కాంగ్రెస్ నాయకులపై బండి సంజయ్ ఫైర్



రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై కరీంనగర్ బీజేపీ ఎంపీ బండి సంజయ్ విరుచుకుపడ్డారు. రైస్ మిల్లర్లతో కాంగ్రెస్ నేతలు కుమ్మక్కయారని అన్నారు. వేల కోట్లు దోచుకుని ఢిల్లీకి పంపుతున్నారని ఆరోపించారు. నల్గొండ జిల్లా బీజేపీ కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. పౌరసరఫరాల శాఖలో అతిపెద్ద కుంభకోణం జరిగిందని అన్నారు. రైస్ మిల్లర్లతో కాంగ్రెస్ నాయకులు కుమ్మక్కయ్యారని బండి సంజయ్ అన్నారు. ఉత్తమ్ కుమార్ రెడ్డిపై తనకు నమ్మకం ఉందని.. కానీ ఆయన కత్తి తీయడం లేదన్నారు. రైస్ మిల్లర్ల నుంచి ఏ నాయకుడికి ఎంత ముట్టిందో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఆ శాఖలో జరిగిన అక్రమాలు, అవినీతిపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలని అన్నారు. పౌరసరఫరాల శాఖ నష్టాల్లో ఎందుకు ఉందో చెప్పాలని ప్రశ్నించారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పడగొట్టే ప్రయత్నాలు బీజేపీ చేయదని బండి సంజయ్ తెలిపారు. ప్రభుత్వాన్ని పడగొట్టే అవకాశాన్ని కాంగ్రెస్ నేతలు ఇంకొకరికి ఇవ్వరని ఎద్దేవా చేశారు. పార్లమెంటు ఎన్నికల ఫలితాల తర్వాత కాంగ్రెస్ నేతలు రోడ్లపై తిరిగే పరిస్థితి ఉండదని విమర్శించారు.

# తాగు నీటి కష్టాలు తీరినట్టేనా

**అదిలాబాద్ :** రాష్ట్ర రాజధాని హైదరబాద్ తాగునీటి గండాన్ని గట్టెక్కించేందుకు ఎల్లంపల్లి జలాశయ అదికారులు భగీరథ ప్రయత్నమే చేస్తున్నారు. మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల నడుమ గోదావరిపై నిర్మాణమైన ఎల్లంపల్లి మండుతున్న ఎండలతో ఎండి ఎడారిలా మారుతుండటంతో.. ఇన్‌టెక్ కాల్వలకు నీరొచ్చే అవకాశం లేకపోయింది. దీంతో అదనంగా మోటర్లను ఏర్పాటు చేసి కాల్వల్లోకి నీటిని ఎత్తిపోసేందుకు సిద్దమవుతున్నారు. ఈ భగీరథ ప్రయత్నం సక్సెస్ అయితే అబ్దుల్ కలాం సుజల స్రవంతి పథకంలో భాగమైన బ్రహ్మణపల్లి పంప్ హౌజ్ నుండి రాష్ట్ర రాజధానికి వర్షకాలం వరకు నీటి సరపరా కు డోకా లేనట్లే అంటున్నారు అధికారులు.ఎల్లంపల్లి ఎన్నడూ లేనంతగా అడుగంటి పోయి ఎడారిలా మారి తల్లడిల్లుతోంది. మండుతున్న ఎండలతో అడుగంటుతున్న ఎల్లంపల్లి 2016లో ఏర్పడిన తాగినీటి కష్టాలను పునారావృతం చేసేలా కనిపిస్తోంది. ప్రస్తుతం ప్రాజెక్ట్‌లో 148 అడుగులకు గాను 140.5 అడుగుల నీటి మట్టం మాత్రమే ఉండటం.. 20 టీఎంసీలకు గాను 5.5 టీఎంసీల నీరు మాత్రమే జలాశయంలో నిల్వ ఉండటంతో డెడ్ స్టోరేజీకి సమీపంలోకి వచ్చి చేరింది. భానుడి భగభగలతో రోజుకు 160 క్యూసెక్కుల నీరు ఆవిరవుతుండగా.. 331 క్యూసెక్కుల నీరు హైదరబాద్ కు తాగునీటి అవసరాల కోసం ఎన్టీపీసీకి 121 క్యూసెక్కుల నీరు బ్రహ్మణపల్లి పంప్ హౌజ్ నుండి సరపరా అవుతోంది. బ్రహ్మణపల్లి పంప్ హౌజ్‌కు నీళ్లు చేర్చే ఇన్ టెక్ కాల్వకు సమీపంలో ఎల్లంపల్లి జలాశయ మట్టం 138.5 అడుగులకు పడిపోవడంతో పంప్ హౌజ్ కు నీరు చేరడం గగనమైంది. దీంతో అలర్ట్ అయిన హెచ్ఎండబ్ల్యుఎస్ అధికారులు ఎల్లంపల్లి జలాశయంలో వార్ జోన్ ను ఏర్పాటు చేసి, 120 హెచ్ పీ సామర్థ్యం ఉన్న 20 మోటర్ల ను యుద్ద ప్రాతిపదికన బిగించి తాగునీటి కష్టాలకు చెక్ పెట్టే ప్రయత్నం మొదలు పెట్టారు.ఉదయం ఎర్రని ఎండలు.. సాయంత్రం ఒక్కసారిగా చల్లగా మారి ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురుస్తున్నా.. భగీరథ ప్రయత్నాన్ని మాత్రం ఆపడం లేదు సిబ్బంది. అబ్దుల్ కలాం సుజల స్రవంతి పథకం ద్వారా హైదరబాద్ మెట్రోపాలిటిన్ సిటీకి నీరందించే ప్రయత్నం చేస్తున్నారు బ్రహ్మణపల్లి పంప్ హౌజ్ అధికారులు. పంప్ హౌజ్ ఇంఛార్జ్ సతీష్ ఆద్వర్యంలో జలాశయంలో ఎత్తిపోతల



ద్వారా నీటిని కాల్వలోకి తరలించదుకు మోటర్లను బిగించే భగీరథ యత్నం చకాచకా సాగుతోంది. 25 సబ్మెర్సిబుల్ పంపులను నదిలో ఏర్పాటుచేసి అప్రోచ్ కాలువలోకి ఎత్తిపోయనున్నారు. జులై చివరి వారం నాటికి ఈ ప్రాజెక్టుకు ఇన్ఫో ప్రారంభమవుతుంది. అప్పటి వరకు అప్రోచ్ కాలువలోకి నీటి ఎత్తిపోత తప్పనిసరని బ్రహ్మణపల్లి పంప్ హౌజ్ అధికారులు చెప్తున్నారు.2016 లో ఇదే పరిస్థితి ఎదురవడంతో ఆ ఏడాది 16 మోటర్లను నదిలో బిగించి ఇన్ టెక్ కాల్వలోకి ఎల్లంపల్లి జలాలను ఎత్తిపోశారు. ఈ ఏడాది హైదరబాద్ తోపాటు మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల మిషన్ భగీరథకు, ఎన్టీపీసీకి అత్యవసర మంచి నీటి సరపరా కోసం 120 హెచ్ పీ సామర్థ్యం ఉన్న మరో నాలుగు అత్యాధునిక సబ్మెర్సిబుల్ పంపులను నదిలో ఏర్పాటుచేసి ఇన్ టెక్ కాల్వలన నింపే ప్రయత్నం చేస్తున్నామని అధికారులు చెబుతున్నారు .ప్రస్తుతం ఎల్లంపల్లి ఇన్‌టెక్ వెల్ వద్ద 138 మీటర్ల మట్టం వద్ద నీళ్లు ఉండగా? భగీరథ ప్రయత్నంతో అప్రోచ్ కాలువల లోతును పెంచి ఇన్ టెక్ వెల్ లోకి నీరు వచ్చేలా భగీరథ ప్రయత్నం చేస్తున్నారు. దీని ద్వారా మంచిర్యాల జిల్లాలోని తొమ్మిది మండలాలకు తాగు నీరందించే మిషన్ భగీరథ ఇన్ టెక్ వెల్ లను 140 మీటర్ల మట్టం ఉండేలా జాగ్రత్త పడుతున్నారు. అందుకోసం జేసీబీల సాయంతో కాల్వలలను తవ్వించి గోదావరిలోని నీటిని పంప్ హౌజ్ లోకి మళ్లించే భగీరథ యత్నం చేస్తున్నారు ఎల్లంపల్లి అదికారులు. భగీరథ ప్రయత్నం సక్సెస్ అయితే వర్షకాలం ప్రారంభం వరకు ఇటు మంచిర్యాల జిల్లాకు తాగు నీటి గండం తప్పినట్టే.. అటు బ్రహ్మణపల్లి పంప్ హౌజ్ వద్ద సబ్ మెర్సిబుల్ పంపుల బిగింపు పూర్తయితే.. 140 అడుగులున్న గోదావరి నది గర్బం నుంటి పంప్ హౌజ్ అప్రోచ్ కాల్వలోకి నీరు ఎత్తిపోయడం షురూ అయితే రాష్ట్ర రాజదాని హైదరబాద్ జులై మొదటి వారం వరకు నిరంతరాయంగా తాగునీటి సరపరా చేసే అవకాశం ఉంటుంది. ఆలోగా అకాల వర్షాలతో ఒక్క టీఎంసీ వాటర్ వరద రూపంలో జలాశయంలోకి వచ్చినా తాగునీటి గండాన్ని ఈ ఏడాది గట్టెక్కినంటే అంటున్నారు ఎల్లంపల్లి అదికారులు.

# ముందుకు సాగని సాహితీ కేసు

**హైదరాబాద్ :** బీఆర్ఎస్ హయాంలో జరిగిన భారీ స్కాముల్లో సాహితీ స్కామ్ ఒకటి. సామాన్యుడి సొంతింటి కలను ఆసరాగా చేసుకుని వందల కోట్లను కొట్టేశాడు ఆ సంస్థ ఓనర్ బూదాటి లక్ష్మినారాయణ. అతని వెనుక గులాబీ నేతలు ఉన్నారనే ఆరోపణలున్నాయి. బినామీ డైరెక్టర్స్‌ని పెట్టిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఈ స్కాములో సూత్రధారులు అనే డౌట్స్ ఉన్నాయి. 3,500 మంది సొంతింటి ఆశతో పెట్టుబడి పెట్టి మోసపోయారు. రూ.1,200 కోట్లు చెల్లించి మూడేళ్లుగా బాధపడుతున్నారు. ఆ సొమ్మంతా ఎక్కడకు పోయిందో ప్రతి పైసాకు లెక్కలు ఉన్నాయి. కేసీఆర్ కూతురు కవిత సెటిల్మెంట్స్ చేస్తానని తీసుకున్న డబ్బులకు డైరెక్టర్స్ వద్ద ఆధారాలున్నాయి. రూ.1,000 కోట్లు ఛైర్మన్ బూదాటి లక్ష్మినారాయణ ఎవరెవరికి ఏ ప్రాజెక్ట్‌లో పెట్టాడో ప్రతీ రిసిప్ట్‌లు లభ్యమవుతాయి. కానీ, సీసీఎస్ పోలీసులు ఇవేమీ పట్టించుకోకుండా విచారణను జాప్యం చేస్తున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెగ్యూలర్‌గా డైరెక్టర్స్‌ని, డబ్బులు తీసుకున్న వారిని విచారణ చేస్తున్నా ఇంకా ఎందుకు కొలిక్కి రావడం లేదని ప్రశ్నిస్తున్నారు.పోలీసుల కళ్ల ముందే బూదాటి తప్పించుకు తిరుగుతున్నాడు. భూముల రేట్లు పెరిగాయని చెప్పుకుంటూ, కొత్త పార్టీలకు ఆ ప్రాజెక్ట్స్ అప్పగించేందుకు సింగపూర్ కంపెనీలతో మీటింగులు పెట్టుకుంటున్నట్లు సమాచారం. గోవాలో మందు, విందు పార్టీలతో తెగ ఎంజాయ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. బెంగుళూరు టు గోవా వయా హైదరాబాద్‌కు ఎవరికీ దొరకకుండా చక్కర్లు కొడుతున్నట్లు సమాచారం.హైదరాబాద్‌లో పేరొందిన ఓ చార్టెడ్ అకౌంటెంట్ సాహితీ స్కామ్‌ని టేకోవర్ చేసేలా ప్లాన్స్




వేస్తున్నట్లు తెలుస్తోంది. ఐఏఎస్, ఐపీఎస్‌లతో పాటు బడా కంపెనీలకు అకౌంట్స్, ఆడిట్ చేసే ఆ చార్టెడ్ అకౌంటెంట్ లాబీయింగ్ చేస్తున్నట్లు సీసీఎస్ వద్ద తెగ మాట్లాడుకుంటున్నారు. ఎవరైతే పోరాటం, ఫిర్యాదులు చేస్తున్నారో వారికి మాత్రమే డబ్బులు ఇచ్చి సెటిల్మెంట్స్ చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు. ఇప్పటికే 14 మంది బాధితులకు సదాశివపేట్‌లో ఓపెన్ ప్లాట్స్ 18 వేలకు గజం చొప్పున అప్పగించారు. సీసీఎస్‌లో ఫిర్యాదులు చేసిన వారిలో ఒకరికి 90 శాతం, మరో ఇద్దరికి 70 శాతం డబ్బులు మొదట్లోనే ఇచ్చేశారు.అమీన్ పూర్‌లో హైరెజ్ టవర్స్ అంటూ జరిగిన మోసంపై బాధితులు సైట్‌లోనే టెంట్స్ వేసుకుని అందోళన చేస్తున్నారు. మోసం చేసిన వారు కళ్ళ ముందే తిరుగుతుండటంతో ఆందోళనలు మరింత తీవ్రతరం చేసేందుకు సిద్ధమయ్యారు. కొద్ది రోజుల్లోనే ధర్నా చౌక్ వద్ద మరోసారి ధర్నాలు చేసేందుకు ప్లాన్ చేస్తున్నారుకాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత హైదరాబాద్ అడిషనల్ సీపీ క్రైం ఆధ్వర్యంలో బాధితుల వద్ద నుంచి డేటా సేకరించారు. బడా నేతలు, బిల్డర్స్ పాత్ర ఏంటో తేల్చేశారు. దీంతో సీసీఎస్‌లో ఉండే ఏసీపీ ఉమామహేశ్వర్ రావు, డీసీపీ శ్వేత కేసులో పూర్తి ఆధారాలు రాబట్టారు. అయితే, దర్యాప్తు వేగవంతంగా కనిపించినా ఎక్కడో బ్రేకులు పడుతున్నాయి. లాబీయింగ్‌లతో పాటు ఒత్తిళ్లు పనిచేస్తున్నాయని బాధితులు అభిప్రాయపడుతున్నారు. క్రిమినల్ కేసుగా కాకుండా సివిల్ కేసుగా విచారణ జరుపుతున్నట్లు అనుమానాలు పుట్టుకొస్తు న్నాయి. అధికారులను మేనేజ్ చేశామని కొంతమంది ఫైనాన్సర్స్, సాహితీ నుంచి డబ్బులు తీసుకున్న వారు బహిరంగంగానే చెబుతుండటంతో కేసు నీరుగారుతోందని బాధితులు ఆందోళన చెందుతున్నారు. ఈ కేసులో ఎలాంటి ఒత్తిళ్లు లేకుండా విచారణ జరగాల్సిన అవసరం ఉంది. ఈడీ కేసు నమోదు చేసినందున ప్రతి పైసాకి లెక్క సీసీఎస్ విచారణలో ఉంటుందని, లేదంటే పోలీస్ అధికారులకు కూడా చిక్కులు తప్పవనే ధీమా బాధితుల్లో కనిపిస్తోంది.

## పోటాపోటీగా దశాబ్ది వేడుకలు



**హైదరాబాద్ :** కొత్తగా తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కార్ తొలిసారి తమ అధ్వర్యంలో జరిపే రాష్ట్ర ఆవిర్భవ వేడుకలను ఎంతో వైభవంగా జరపాలని అనుకుం టోంది. గత పదేళ్లుగా యావత్ తెలంగాణ సెంటిమెంట్ ను కేసీఆర్ కనుసన్నల్లోనే జరిగాయి. ప్రత్యేక రాష్ట్రం కోసం చావు నోట్లో తల పెట్టి మరీ సాధించుకున్నానని గత పదేళ్లుగా సెంటిమెంట్ ను పోగేసుకున్న కేసీఆర్ కు ఈ ఆవిర్భవ వేడుకల ద్వారా ఎలాగైనా ఝలక్ ఇవ్వాలని చూస్తోంది కాంగ్రెస్. అందుకే ఈ సారి గట్టిగానే సోనియా, రాహుల్ గాంధీ ల వలనే తెలంగాణ తెచ్చుకున్నామని చెప్పే ప్రయత్నాలు ముమ్మరం చేద్దామని భావిస్తోంది కాంగ్రెస్ సర్కార్. అఫిషియల్ గా కాంగ్రెస్ జరుపుతున్న ఉత్సవా లకు ధీటుగా కేసీఆర్ గొప్పదనాన్ని ప్రజలలోకి మరింగా తీసుకెళ్లేందుకు బీఆర్ఎస్ పక్కాగా ప్లాన్ చేస్తోంది. ఒకవేళ పబ్లిక్ గా ఎన్నికల కమిషన్ ఒప్పుకోకుంటే తెలంగాణ భవన్ లో ధూం ధాంగా నైనా నిర్వహించుకోవాలనుకుంటోంది బీఆర్ఎస్. అయితే తాము జరుపుకునే ఆవిర్భవ వేడుకల ద్వారా తెలంగాణ ప్రజానీకానికి స్పష్టమైన సంకేతం ఇవ్వాలని, అలాగే కార్యకర్తల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించే లా జరుపుకోవాలని, పార్టీకి పునర్వైభవం తెచ్చేలా జరగాలని బీఆర్ఎస్ అగ్రనేతలు కసరత్తు చేస్తున్నారని సమాచారం. కేసీఆర్‌ను తెలంగాణ జాతిపితగా అభివర్ణించే ఆ పార్టీ నేతలు.. అదే లెగసీని ఇలాగే కొనసాగించడానికి ప్రభుత్వం నిర్వహించే ప్రోగ్రామ్‌ను తలదన్నే రీతిలో నిర్వహించాలనే స్థాయిలో బీఆర్ఎస్ నిర్ణయం తీసుకుంటోందని సమాచారం. ఒకటి రెండు రోజుల్లో ఈ విషయంపై క్లారిటీ రానుంది.తెలంగాణ ఆవిర్భవ వేడుకల నిర్వహణ పై ఇంకా బీఆర్ఎస్ ఎలాంటి క్లారిటీ ఇవ్వలేదు. కానీ సీనియర్ నేతలు, జిల్లాల ఇన్ ఛార్జిల సూచనలు, సలహాలు తీసుకుని వేడుకలను జరిపించేందుకు బీఆర్ఎస్ సమాయాత్తం అవుతున్నట్లు సమాచారం. రాష్ట్రం ఏర్పడిన తర్వాత పదేండ్ల పాటు అధికారంలో ఉండి ప్రభుత్వ ప్రోగ్రామ్‌గానే నిర్వహించిన బీఆర్ఎస్ ఇప్పుడు ప్రతిపక్ష హోదాలో ఫస్ట్ టైమ్ తెలంగాణ భవన్‌లో నిర్వహించడానికి సమాయత్తమవుతున్నది. కేసీఆర్‌ను తెలంగాణ తెచ్చిన హీరోగా నిలబెట్టాలనుకుంటున్నది. పదేండ్ల పాలనా ఫలాలను ప్రదర్శించడమే కాకుండా.. తెలంగాణ రాష్ట్ర సమితి పేరుతో రాజకీయ పార్టీని స్థాపించి ఉద్యమానికి ఊపిరులూదిన ఘట్టాలన్నింటినీ ప్రజలకు తెలిసేలా ఫొటో ఎగ్జిబిషన్‌ను పెట్టి ప్రజల్లోకి బలమైన మెసేజ్‌ను తీసుకెళ్లాలన్నదే ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తున్నది.తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చింది సోనియాగాంధీ అంటూ కాంగ్రెస్ బలంగా చెప్తున్న పరిస్థితుల్లో రాష్ట్ర సాధనకు యావత్తు తెలంగాణ ప్రజలను ఉద్యమంలోకి దూకించి సోనియాగాంధీని ఒప్పిం చిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని బీఆర్ఎస్ ఈ ప్రోగ్రామ్ ద్వారా చెప్పాలనుకుంటున్నది. టీఆర్ఎస్‌ను స్థాపించిన తర్వా త మంత్రి పదవులను, అధికారాన్ని ఉద్యమం కోసం త్యాగం చేసి రాష్ట్ర సాధనే లక్ష్యంగా కేసీఆర్, గులాబీ లీడర్లు కృషి చేశా రని అప్పటి జ్ఞాపకాలను కూడా ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు వివరించాలని భావిస్తున్నది. ఏ లక్ష్యం కోసం రాష్ట్రాన్ని తెచ్చుకున్నామో ఆ ఆకాంక్షలకు ఆచరణ రూపం ఇచ్చి పదేండ్లలో తెలంగాణను సంక్షేమ అభివృద్ధి రంగాల్లో దేశానికే ఆదర్శంగా కేసీఆర్ తన పాలనా చతురతతో తీర్చిదిద్దారనే అంశాన్ని కూడా నొక్కిచెప్పాలనుకుంటున్నదిరాష్ట్ర ఏర్పాటులో కేసీఆర్ పాత్ర మాత్రమే కాక సబ్బండ వర్ణాలు ఉద్యమంలోకి దూకాయని, 1200 మంది విద్యార్థులు, యువత, తెలంగాణ ప్రజలు ప్రాణత్యాగం చేశారన్న అంశాన్ని అధికారిక ఉత్సవాల ద్వారా కాంగ్రెస్ ఎస్టాబ్లిష్ చేయదల్చుకున్నది. సోనియాగాంధీ ఇచ్చిన మాట ప్రకారం పార్టీ నష్టపోయినా ప్రజల త్యాగాలు, ఆకాంక్షల మేరకు కఠిన నిర్ణయం తీసుకున్నారని, ఆమె ఈ నిర్ణయం తీసుకుని ఉండకపోతే రాష్ట్రం ఏర్పడేదే కాదని కాంగ్రెస్ ఆరోపిస్తున్నది. కానీ కేసీఆర్ పదేండ్ల పాటు క్రెడిట్ కొట్టేసి ప్రజల ఉద్యమ స్ఫూర్తిని, అమరవీరుల త్యాగాలను చిన్నచూపు చూశారని పేర్కొంటున్నది.

## అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారు

**కుత్బుల్లాపూర్ :** భౌరం పెట్ లో వ్యవసాయ భూమిని అమ్మనందుకు కిరాయి గుండాలతో తమ పై దాడి కి యత్నిస్తున్నారని రెండు రోజుల క్రితం దుండిగల్ పోలీస్ స్టేషన్ వెళ్లిన రైతుల ఘటన మరవకముందే,రైతులకు మరో సమస్య వచ్చి పడింది.తమ పైనే కేసులు పెట్టేందుకు వెళ్తారా అని త్రిపుర భవన నిర్మాణ సంస్థ మరియు కొందరు బి అర్ ఎస్ నాయకులు కలిసి అదే రైతుల పై అక్రమ కేసులు బనాయించి జైలు కు పంపుతున్నారని అవేదన వ్యక్తం చేశారు రైతుల కుటుంబ సభ్యులు..బౌరం పేట లోని తమ వ్యవసాయ భూమిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో తమ గోడు ను విన్నవించుకున్నారు. బౌరం పెట్ గ్రామానికి చెందిన రైతులను ఏడేళ్ళు గా వేధిస్తున్నారని కోర్టు కార్యాలయాల చుట్టు తిరిగి తమ భూమి లో కి ఎవరు రావొద్దని ఆర్థర్ తెచ్చుకుంటే,అవేవీ పట్టించుకోకుండా హింసిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు సదరు భూమి యజమానులు. కుత్బుల్లాపూర్ నియోజక వర్గంలోని బౌరం పెట్ సర్వే నం.188,187,189లో గల 2ఎకరాల 32 గుంటల స్థలం విషయంలో కృష్ణా రెడ్డి, కంసమ్మా అనే రైతులకు త్రిపుర భవన నిర్మాణ సంస్థ కు మధ్య గత కొద్ది రోజులుగా గొడవలు జరుగుతున్నాయి. వ్యవసాయ భూమిలోకి వచ్చి పంట నాశనం చేయడమే కాకుండా ఎదురు తిరిగిన వాళ్లపై అక్రమ కేసులు పెట్టీ వేధిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు రైతుల భార్యాపిల్లలు.

తరతరాలు గా తాతల నుండి సంక్రమించిన తమ భూమి పై బి అర్ గల్లి లీడర్లు కన్నేసి,త్రిపుర ల్యాండ్ మార్క్ సంస్థ తో కలిసి వేధిస్తున్నారని...ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతుల విషయంలో చొరవ చూపి ఇలాంటి గుండాలపై కఠిన చర్యలు తీసుకుని తమ కు న్యాయం జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.త్రిపుర భవన నిర్మాణ సంస్థ తో కల్సి మేకల వెంకటేష్, పసుపులేటి సుధాకర్ అనే బి అర్ ఎస్ నాయకులు తమ పై వొత్తిడి తెస్తున్నానరని వారి చెర నుండి తమకు రక్షణ కల్పించాలని కోరారు.

# ప్రైవేట్ విద్యకే ప్రోత్సాహం



**హైదరాబాద్ :** విజ్ఞానాన్ని పంచి అనేక మంది మేధావులను, ఉన్నత విద్యావంతులను సమాజానికి అందిస్తూ అనేక ఆసక్తికరమైన అంశాలను తెరపైకి తీసుకువచ్చే పరిశోధన కేంద్రాలుగా విలసిల్లవల్సిన ప్రభుత్వ యూనివర్శిటీలు నేడు కనీస సౌకర్యాలు లేక నిర్లక్ష్యానికి గురవుతూ అసౌకర్యాలకు నిలయంగా మారాయి. స్వరాష్ట్రం వస్తే ప్రభుత్వ యూనివర్సిటీల్లో మెరుగైన వసతులతో కూడిన విద్య అందుతుందనే నమ్మకంతో తెలంగాణ ప్రాంతంలోని ఉస్మానియా, కాకతీయ సహా అన్ని యూనివర్సిటీల విద్యార్థులు తెగించి కొట్లాడి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకున్నారు. అయితే, ఎన్నో ఆశలు పెట్టుకున్న నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం యూనివర్సిటీలను కనీసం పట్టించుకోకుండా పూర్తిగా నిర్లక్ష్యం చేసిందనే విమర్శలున్నాయి. ప్రైవేట్ యూనివర్సిటీలకు అనుమతి ఇచ్చి ప్రభుత్వ విశ్వవిద్యాలయాలను పూర్తిగా నిర్వీర్యం చేసిందనే ఆరోపణలు వినిపించాయి. బీఆర్ఎస్ తీరుతో పేద బడుగు బలహీనవర్గాలకు చెందిన విద్యార్థులు మెరుగైన విద్యకు దూరం అయ్యారు. కొత్తగా ఏర్పడ్డ రేవంత్ సర్కార్ అయినా పట్టించుకుని న్యాయం చేస్తుందన్న ఆశల్లో విద్యార్థులు ఉన్నారు. త్వరలో ఖాళీ అవుతున్న వీసీల నియామకానికి సంబంధించిన కసరత్తును విద్యాశాఖ వేగవంతం చేయడంతో ప్రభుత్వ యూనివర్సిటీలపై ప్రభుత్వం దృష్టి పెడుతుందని నమ్ముతున్నారు.2014లో కొత్తగా రాష్ట్రం ఏర్పడ్డాక కేసీఆర్ సర్కార్ అప్పటి వీసీల కాలపరిమితి తీరిన తర్వాత రెండేళ్లు ఐఏఎస్ ఆఫీసర్లను వీసీలుగా నియమించింది. అయితే, అప్పుడు విశ్వవిద్యాలయాల పరిపాలన నత్తనడకన సాగింది. 2016లో తొలిసారిగా తెలంగాణలో వీసీల నియామకాలు జరిగాయి. 2019లో మళ్ళీ ఇన్‌చార్జిల పాలన తర్వాత పూర్తిస్థాయిలో 2021లో నియామకాలను చేపట్టింది. ఈ కాలం అంతా యూనివర్సిటీలను ఎన్నడూ పేదలకు విద్యను అందించే కేంద్రాలుగా కేసీఆర్ ప్రభుత్వం చూడలేదన్న అపవాదు ఉంది. కేవలం అప్పటి అధికార పార్టీ రాజకీయ నాయకుల పునరావాస కేంద్రాలుగా వీటిని మార్చారనే విమర్శలున్నాయి. అధ్యాపకుల నియామకాలు చేపట్టకపోవడం, రీసెర్చ్ గ్రాంట్స్ విడుదల చేయకపోవడంతో పరిశోధనలు పక్కదారి పట్టాయి. రాజకీయ జోక్యం కారణంగా కుల, మత ప్రభావంతో విశ్వ విద్యాలయాలు తమ ప్రభ కోల్పోయాయి. అభివృద్ధి, నాణ్యత లేక ప్రమాణాలు దిగజారిపోయి ర్యాంకింగ్స్‌లో పడిపోయాయి. అందుకే, వైస్ ఛాన్సలర్స్ నియామకాలు పారదర్శకంగా జరిగినప్పుడే వర్సిటీల అభివృద్ధి సాధ్యమవుతుంది. రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు యూనివర్సిటీల నిధులు క్రమంగా తగ్గాయి. అభివృద్ధి కోసం కేటాయించిన నిధులు శూన్యం. కొత్తగా మహిళా, ఫారెస్ట్ యూనివర్సిటీలను గత ప్రభుత్వం తీసుకుని వచ్చినా, కనీసం సౌకర్యాలు, ఫ్యాకల్టీ నియామకాలను చేపట్టలేదు. నిధులు లేక బాసర ట్రిపుల్ ఐటీ విద్యార్థులు చేసిన ఆందోళనలు చూశాం. విద్యార్థులకు మెస్, ల్యాబ్స్, లైబ్రరీ సౌకర్యాలు లేవు. రేకుల షెడ్లు, పాత భవనాల్లో హాస్టళ్లు నడుస్తున్నాయి. నిధులు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తూ యూనివర్సిటీల ప్రాధాన్యత తగ్గించే కుట్రలు జరిగాయన్న ఆరోపణలు వినిపించాయి. సరైన భోజన సదుపాయాలు, వైద్య, వసతి సదుపాయాలు కూడా లేవు. ప్రస్తుతం ఒక్కో సెర్చ్ కమిటీలో యూజీసీ నామినీతో పాటు వర్సిటీ నామినీ, సర్కారు నామినీ ఉంటారు. ఈ కమిటీ సమావేశాలను నిర్వహించేందుకు విద్యాశాఖ రెడీగా ఉంది. కానీ, ఎన్నికల కోడ్ అమల్లో ఉండటంతో కమిషన్ అనుమతి కోసం విద్యాశాఖ లేఖ రాసింది. ఎలక్షన్ కోడ్ జూన్ మొదటి వారం వరకూ ఉంటుంది. దీంతో సెర్చ్ కమిటీల భేటీ తర్వాత ఆ పేర్లను ప్రకటించాలన్నా మళ్లీ ఈసీ అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. దీంతో ముందుగానే సెర్చ్ కమిటీల భేటీతో పాటు, కొత్త వీసీల నియమాకానికి అనుమతి కోరింది. త్వరలోనే అనుమతి వచ్చే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఈసీ అనుమతి రాగానే అన్ని వర్సిటీల సెర్చ్ కమిటీల సమావేశాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.రాజకీయ జోక్యంతో వచ్చిన వీసీలు రెగ్యులర్ కోర్సులను రద్దు చేస్తూ సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులను ప్రోత్సహిస్తున్నారు. వేలాది రూపాయలు పేద విద్యార్థుల నుంచి దండుకుంటున్నారు. తెలంగాణ రాకముందు ఉస్మానియా యూనివర్సిటీలో 3 నుంచి 5 వేల రూపాయలు ఉన్న కోర్సు ఫీజును రూ.35 వేలు చేశారు. రెండు వేలు ఉన్న పీహెచ్‌డీ ఫీజు 20 వేల రూపాయలకు పెంచారు. దీంతో అణగారిన వర్గాలు చదువుకు దూరం అయ్యాయి. గత ప్రభుత్వం కనీసం ఒక్కసారి కూడా యూనివర్సిటీ విద్య, సౌకర్యాలపై సమీక్ష చేయలేదు. ఈ ప్రభుత్వమైనా సమీక్షించి సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు విద్యార్థులు. పేద వర్గాల విద్యార్థులను పరిశోధనలు చేయడానికి ప్రోత్సహించాలి. నేషనల్ ఫెలోషిప్స్ రాని విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం నెలకు 25 వేల రూపాయలు ఫెలోషిప్ ఇవ్వాలి. పీజీ విద్యార్థులకు నెలకు 5 వేలు ఫెలోషిప్ ఇవ్వాలి. స్కిల్స్ పెంచడానికి చర్యలు తీసుకోవాలి. యూనివర్శిటీ అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు ఇవ్వాలి. నూతన హాస్టల్స్ నిర్మాణం, మోడ్రన్ లైబ్రరీ, సైన్స్ ల్యాబ్స్, రిసెర్చ్ సెంటర్స్ ఏర్పాటు చేయాలి. విద్యార్థులకు నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవడానికి, ప్రజాస్వామ్య రక్షణకు విద్యార్థి సంఘాలు ఎన్నికలు నిర్వహించాలి. ప్రతి సంవత్సరం అన్ని యూనివర్శిటీలకు రిసెర్చ్ గ్రాంట్స్ ఇవ్వాలి. వీసీల నియామకాలు ఒక్కటే కాకుండా ప్రభుత్వ యూనివర్శిటీలను, వాటి అనుబంధ క్యాంపస్‌లను అభివృద్ధి చేయాలని కోరుతున్నారు


Vaasthava Nestham Telugu daily: Printed, Published Edited and Owned by: SYED QAMAR, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin Code: 504307, Printed at AR printers, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin code: 504307, TITLE CODE: TELMUL/2023/85744, EDITOR: SYED QAMAR Contact Number: 8099779988, Email: vntelugudaily@gmail.com, vaasthavanestham.com